# ఎంసీహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఆసుపత్రి నిర్వహణపై కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**



గర్భిణీ మహిళలకు మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎంసీహెచ్ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణీల వివరాలు ఈడీబీ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. 102 'అమ్మ ఒడి' వాహనాల ద్వారా గర్భిణీలను ఆసుపత్రికి తరలించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఫిబ్రవరి నెలలో 182 ప్రసవాలు ఎంసీహెచ్‌లో జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరగాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలు అందించే సమాచారాన్ని సూపర్వైజర్లు క్రాస్ చెక్ చేయాలని, 102 సేవలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రసవం అనంతరం తల్లి, శిశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బాలింతలు, శిశువులకు నిరంతరం టీకాలు వేయాలని సూచించారు. మంథని ఎంసీహెచ్ గతంతో పోలిస్తే మెరుగ్గా పనిచేస్తోందని, ఇంకా మెరుగైన సేవల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని, ఓపీ సేవలు టోకెన్ విధానంలో అందించాలని ఆదేశించారు. ఓపీ అనంతరం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆసుపత్రిలో రోగులను ఎట్టి పరిస్థితుల్లో తిరస్కరించరాదని స్పష్టం చేశారు. రోగులు, సహాయకులకు అవసరమైన సీటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లు శుభ్రంగా నిర్వహించాలని, పారిశుధ్య సిబ్బంది విధులు సమర్థంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో విజయవంతమైన యూరాలజీ శస్త్రచికిత్సలు

**ఆధునిక పద్ధతులతో చికిత్సలు**

**వైద్య బృందానికి అభినందనలు**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**





జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో యూరాలజీ విభాగంలో ఆధునిక పద్ధతులతో రెండు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కొలనూరు గ్రామానికి చెందిన 27 ఏళ్ల మహిళ కడుపు నొప్పితో ఆసుపత్రికి రాగా, పరీక్షల్లో కిడ్నీలో సుమారు 2 సెంటీమీటర్ల రాయి ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు ఎడమ వైపున పీసీఎన్ఎల్ (పర్క్యుటేనియస్ నెఫ్రోలిథోటమీ) శస్త్రచికిత్స నిర్వహించి, డీజే స్టెంట్ అమర్చినట్లు వైద్యులు తెలిపారు. అలాగే గోదావరిఖనికి చెందిన 45 ఏళ్ల మహిళకు గతంలో కిడ్నీ రాళ్ల సమస్యతో డీజే స్టెంట్ అమర్చగా, ఈరోజు శస్త్రచికిత్స ద్వారా ఆ స్టెంట్‌ను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సల్లో యూరో సర్జన్ డాక్టర్ సంతోష్ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, అనస్తీషియా వైద్యురాలు డాక్టర్ భవాని పాల్గొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ పర్యవేక్షణలో ఆపరేషన్లు నిర్వహించారు. వైద్య బృందం, ఓటీ సిబ్బందిని సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఆసుపత్రిలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం, 2డీ ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్, కంటి, ఆర్థో, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో ఎలాంటి సేవలకైనా ఎవరూ డబ్బులు ఇవ్వకూడదని, ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్‌లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలు ఉచితమని స్పష్టం చేశారు.

# విద్యుత్ బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలి



**గోదావరిఖనిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

విద్యుత్ బస్సులను ఆర్టీసీకే కేటాయించి సంస్థను బలోపేతం చేయాలని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం గోదావరిఖని బస్ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ.నరేష్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మికుల సమస్యలు వినిపించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బస్సుల అమలులో ఆర్టీసీకి ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రైవేట్ సంస్థలకు లాభాలు కలిగించే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్లు, మౌలిక వసతుల పేరుతో ఆర్టీసీ భూములను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటార్ వెహికిల్స్ చట్టం, విద్యుత్ బస్సుల విధానం వల్ల ఆర్టీసీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. జీసీసీ విధానాన్ని రద్దు చేసి, ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలను ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేయాలి



**అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**

సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.

మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి మండలంలో సీఎస్ఆర్ ద్వారా జరుగుతున్న పనుల ప్రస్తుత స్థితిగతులపై పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని సూచించారు. సింగరేణి సంస్థ ద్వారా రామగుండం పరిధిలో సుమారు ఐదు కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆ నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని, రామగుండం గ్రంథాలయాన్ని ఆధునీకీకరించేందుకు ఫర్నిచర్, పుస్తకాలు తదితర సదుపాయాల కల్పనకు నిధులు వినియోగించాలని సూచించారు. అదేవిధంగా, ఎన్‌టీపీసీ యాష్ పాండ్ ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. సీఎస్ఆర్ పనులకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికేట్లు (యూసీలు) సమయానికి సమర్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల కేంద్రనికి చెందిన తోటపల్లి రాములమ్మ బదునాపూర్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3000 మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్, మాజీ సర్పంచ్ లలిత ఒ జ్యోత్తయ్య ,వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్, పోతుగంటి కుమార్ మరియు నాయిని గణేష్ దుగ్గాపురం రవి బాలకృష్ణ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు,

# సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో పద్మరావుకు ఘన వీడ్కోలు

**ముందస్తు పదవి విరమణ సందర్భంగా అభినందనలు వెల్లువ**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో టిటిసి ఇన్స్ట్రక్టర్‌గా సేవలందించిన సంఘాల పద్మరావుకు ముందస్తు పదవి విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31న పదవి విరమణ చేయనున్న ఆయనకు సహచరులు, కార్మికులు, అధికారులు అభినందనలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధనలో నిబద్ధతతో పనిచేసిన పద్మరావు, ట్రేడ్ యూనియన్ నాయకుడిగా, ఇన్స్ట్రక్టర్‌గా విశేష సేవలు అందించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. రాష్ట్రపతి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నప్పటికీ ఎలాంటి అహంకారం లేకుండా సాదాసీదాగా జీవించడం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు. కార్మికులు, అధికారులు అందరి మన్ననలు పొందిన ఆయన మృదుస్వభావి, స్నేహశీలి, అపార జ్ఞాన సంపన్నుడిగా నిలిచారని సహచరులు కొనియాడారు. పదవి విరమణ అనంతరం కూడా సామాజిక సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, సహచరులు పద్మరావుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంట్

**రామగుండంలో పోస్టర్ ఆవిష్కరణ**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సామాజిక సమత వేదిక ఆధ్వర్యంలో 'అంబేద్కర్ ప్రీమియర్ లీగ్--2026' క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ టోర్నమెంట్ ద్వారా దళిత, బహుజన, మైనారిటీ యువతలో ఐక్యతను పెంపొందించడంతో పాటు క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 12 వరకు గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజేత జట్టుకు ?40 వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు ?20 వేల బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెవిరాజు, కెనడి, చింతకింది సంపత్, కొలుగురి సాయి కుమార్ (చింటు), ఇరుగురాల శ్రావణ్, అభిషేక్, గూడెపు రణధీర్, హరీష్, అభిలాష్, జితేందర్, కొప్పుల సన్నిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ఐటీఐలో ఘనంగా షహీద్ దివస్ పాదయాత్ర,

**సేవా కార్యక్రమాలతో అమరవీరులకు నివాళులు**

**అగ్నిధార న్యూస్, (పెద్దపల్లి):**

స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 'మై భారత్' ఆధ్వర్యంలో షహీద్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించి, మొక్కల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. 'మేరా యువ భారత్--పెద్దపల్లి' పేరిట విద్యార్థులు జాతీయ జెండాలతో భారీ చైతన్య ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, యువజన సంఘాల నాయకులు శ్రీనివాస్, రాకేష్, మహేష్ తదితరులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల పై మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

జిల్లా కేంద్రంలోని రంగంపల్లి వద్ద అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చాలంటూ మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ కు పట్టణవాసి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. రంగంపల్లి కోర్టు సమీపంలో నిర్మిస్తున్న అపార్ట్మెంట్ వారు నిబంధనల మేరకు అనుమతులు పొంది, అందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఐదు అంతస్థులకే అనుమతి తీసుకోని, అనుమతి లేకుండా దాని పైన మరో మూడు అంతస్థులు నిర్మించారని, వాటి నిర్మాణంలో ఇతర శాఖల అధికారులను మోసగించడంతో పాటు ప్లాటు కొనుగోలు చేసిన వారు సైతం మోసపోయే అవకాశమున్నదన్నారు. ప్రభుత్వ నియమ నిబందనలను ఉల్లంఘించి, ప్రభుత్వ శాఖల అధికారులను, అమాయక ప్రజలను మోసగించి, అక్రమ పద్ధతుల్లో ఆదాయాన్ని ఆర్జించడమే లక్ష్యంగా వెలసిన బిల్డర్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా కొనుగోలుదారులను ఆశ పెట్టి మోసం చేసేలా లక్కీ డ్రా పేరుతో అమ్మకాలు చేస్తున్నా యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తి పైన ఎలాంటి అనుమతి లేకున్నా నిర్మించి 3 ప్లాట్ లను పూర్తిగా కూల్చి వేయించి అమాయక ప్రజలు వాటిని కొనుగోలు చేసి మోసపోకుండా కాపాడలని ఫిర్యాదు లో పేర్కొన్నారు

# అమరవీరుల త్యాగం.. అజరామరం

**నేడు భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ 95వ వర్ధంతి**
**బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన విప్లవ కిశోరాలు**
**సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్షల్ దుర్గం నగేష్**

అగ్ని ధార న్యూస్,(రామగుండం):



భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు చిరస్మరణీయమని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ కొనియాడారు. సోమవారం భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నగేష్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి బానిస చెర నుంచి మాతృభూమిని విముక్తి చేసేందుకు ఈ ముగ్గురు వీరులు సాగించిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. 1931 మార్చి 23న లాహోర్ సెంట్రల్ జైలులో ఉరిశిక్ష పడిన సమయంలో ఆ ముగ్గురు వీరులు ప్రదర్శించిన ధైర్యం అమోఘమని నగేష్ గుర్తుచేశారు. ఉరిశిక్షకు ముందు భగత్ సింగ్ మార్క్సిస్ట్ పుస్తకాన్ని పఠిస్తుండగా, సుఖ్‌దేవ్ పాటలు పాడుతూ, రాజగురు వేద మంత్రాలను జపిస్తూ మృత్యువును చిరునవ్వుతో ఆహ్వానించారని వివరించారు. 'మాకు పిచ్చి వదిలేయండి.. మేము దేశం కోసం త్యాగం చేసే పిచ్చివాళ్లం' అంటూ సుఖ్‌దేవ్ జైలు వార్డెన్‌కు ఇచ్చిన సమాధానం వారి విప్లవ భావజాలానికి నిదర్శనమని పేర్కొన్నారు.భగత్ సింగ్ చిన్నతనంలోనే పొలంలో తుపాకులను విత్తుతూ, బ్రిటిష్ వారిని తరిమికొడతానని చెప్పడం అతని దేశభక్తికి పరాకాష్ట అని నగేష్ అన్నారు. నౌజవాన్ భారత్ సభ, హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ ద్వారా వారు సాగించిన సాయుధ పోరాటం సామ్రాజ్యవాద పునాదులను కదిలించిందన్నారు. సాండర్స్ హత్య ద్వారా లాలా లజపతిరాయ్ మరణానికి ప్రతీకారం తీర్చుకున్నారని, సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరి బ్రిటిష్ పాలకుల నిద్రమత్తును వదిలించారని గుర్తుచేశారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఈ అమరవీరుల ఆశయాలే దిక్సూచి అని నగేష్ అభిప్రాయపడ్డారు. వారి వర్ధంతిని 'షహీద్ దివస్' గా జరుపుకుంటూ, వారు కలలుగన్న సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు దుర్గం ప్రమీల నగేష్ ,సమతా సైనిక దళ్ నాయకులు చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, జిమ్మిడి శాంతి కుమార్, రామ టెంకి విశ్వనాథ్, గూడూరి లవన్ కుమార్, గన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో సెమీకండక్టర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలి




**కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఎంపీ వంశీకృష్ణ**

అగ్ని ధార న్యూస్ (పెద్దపల్లి):

ప్రాంతీయ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల దృష్ట్యా పెద్దపల్లిలో సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.పెద్దపల్లిలో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం కేంద్రానికి పలుమార్లు ప్రాతినిధ్యాలు సమర్పించినప్పటికీ, చివరి నిమిషంలో ఇతర ప్రాంతానికి మళ్లించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లికి రావాల్సిన కీలక అవకాశాన్ని దూరం చేయడం నిరాశ కలిగించిందన్నారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతమవుతుందని, ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని ఆయన వివరించారు. అయినప్పటికీ పెద్దపల్లిని పక్కన పెట్టి ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరైన విధానం కాదని విమర్శించారు. పెద్దపల్లిలో సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు చేసి ప్రాంతానికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజల అభివృద్ధి కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# పెద్దపల్లిలో వరల్డ్ టిబి డే ర్యాలీ



**క్షయవ్యాధి నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు**

అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):

వరల్డ్ టిబి డే సందర్భంగా పెద్దపల్లి పట్టణంలో క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.జిల్లా ప్రధాన ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా అమర్చంద్ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. అనంతరం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం "ఎస్ వి కేన్ ఎండ్ టిబి (మనమంతా కలిసి టిబిని అంతం చేయగలం)" అనే థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షయవ్యాధి మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల వస్తుందని, రోగి దగ్గు, తుమ్ము ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందని వివరించారు. రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పడడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అవసరమైన తెమడ పరీక్షలు, ఛాతి ఎక్స్‌రేలు చేయించుకోవాలని తెలిపారు. సాధారణ టిబి రోగులకు ఆరు నెలల పాటు ఉచిత చికిత్స అందిస్తామని, డ్రగ్ రెసిస్టెంట్ టిబి రోగులకు 1 నుంచి 2 సంవత్సరాల పాటు ప్రత్యేక మందులతో చికిత్స అందిస్తామని పేర్కొన్నారు.

నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో లక్ష్యంగా పెట్టుకున్న వారిలో అధిక సంఖ్యలో పరీక్షలు నిర్వహించి, టిబి రోగులను గుర్తించి వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా ఆసుపత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలలో టిబి పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, ఎన్‌జీవోలు, టిబి ఛాంపియన్స్, పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడి ముందే బీఆర్ఎస్ నేతల అరెస్టు



**ఉప్పు రాజ్‌కుమార్ సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):

బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో చేపట్టిన "అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమం నేపథ్యంలో బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్‌ను పోలీసులు తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు మండల యువజన అధ్యక్షుడు కొయ్య విక్రమ్, నాయకుడు చొప్పరి వంశీలను కూడా అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఉప్పు రాజ్‌కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల వేలాది మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు, విద్యార్థినిలకు స్కూటీల పంపిణీ వంటి హామీలు అమలు కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం మాట తప్పిందని విమర్శిస్తూ, 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపులో ఆలస్యం ఎందుకు జరుగుతోందని, నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టం చేయాలని కోరారు. విద్యా భరోసా కార్డు, స్కూటీల హామీల అమలు ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు.అక్రమ అరెస్టుల ద్వారా ప్రజా సమస్యలను అణచివేయలేరని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# నేటికీ కుల బహిష్కరణలా?

**78 ఏళ్ల స్వతంత్ర భారతానికి ఇది అవమానం!**
**ఒడిశా మాజీ ఎమ్మెల్యే కుటుంబంపై వెలివేటు అమానుషం**
**సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ఆగ్రహం**

అగ్నిధార న్యూస్,(హైదరాబాద్):

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు దాటినా, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా మంటున్న తరుణంలో ఇంకా 'కుల బహిష్కరణ' లాంటి అనాగరిక చర్యలు చోటుచేసుకోవడం సిగ్గుచేటని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ మండిపడ్డారు. ఒడిశాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే తన కుమార్తెకు వేరే కులం యువకుడితో వివాహం నిశ్చయించారన్న నెపంతో, సదరు కుటుంబాన్ని 12 ఏళ్ల పాటు కులం నుంచి బహిష్కరించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. "రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు. ఒక మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికే కుల పెద్దల నుంచి ఇలాంటి వివక్ష ఎదురైతే, సామాన్యుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖోత్ర సామాజిక వర్గానికి చెందిన సదరు మాజీ ఎమ్మెల్యే కుమార్తె, ఒక బ్రాహ్మణ యువకుడిని ఇష్టపడితే.. పెద్దలు అంగీకరించి నిశ్చితార్థం చేసుకున్న తర్వాత కుల బహిష్కరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు.హిందువులందరూ బంధువులే' అనే నినాదాలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో కుల వివక్ష కోరలు చాస్తూనే ఉందని డాక్టర్ నగేష్ విమర్శించారు. కులం కట్టుబాట్ల పేరుతో ఒక కుటుంబాన్ని సామాజికంగా వెలివేయడం అనాగరికమని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనేనని పేర్కొన్నారు.కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలి, బాధితులకు ప్రభుత్వం మరియు పోలీసులు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించి, వివాహాన్ని ప్రశాంతంగా జరిపించాలి, కుల వ్యవస్థలోని ఇటువంటి దురాచారాలను రూపుమాపేందుకు విద్యావంతులు, యువత నడుం బిగించాలి.రాజ్యాంగ విలువలను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు అమలు చేయాలని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు

# అక్రమ పట్టాలు రద్దు చేయాలి

**లేకపోతే ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా: ఊట్ల శ్రీను**

అగ్నిధార న్యూస్ ,(ముత్తారం):

పోతారం గ్రామంలోని సర్వే నంబర్ 59లో ఉన్న ప్రభుత్వ భూమిపై అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసి, అర్హులైన సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను డిమాండ్ చేశారు.మంగళవారం పోతారం గ్రామానికి చెందిన నిరుపేద రైతులతో కలిసి ముత్తారం ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 80 సంవత్సరాలుగా గ్రామస్తులు ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నప్పటికీ, వారికి పట్టాలు ఇవ్వలేదని తెలిపారు.ఇదే సమయంలో కొందరు అపరిచితులు అక్రమంగా పట్టాలు పొందడంతో పాటు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిని అధికారులు వెంటనే పరిశీలించి, అక్రమ పట్టాలను రద్దు చేసి, నిజంగా భూమిని సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు.లేకపోతే ముత్తారం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మార్వో సమస్యను పరిశీలించి తక్షణమే సిబ్బందిని పంపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఇట్టం గట్టయ్యతో పాటు చెలుకల చేరాలు, నూనె మల్లయ్య, నూనె రాయమల్లు, నూనె బుచ్చమ్మ, నూనె లచ్చయ్య, గోనెల రవి, గోనెల సంతు, ఉప్పు భూషణం, ఉప్పు నీళ, ఉప్పు రాజేశం, ఉప్పు మొగిలి, ఉప్పు అంజి, బత్తుల దుర్గయ్య, బత్తుల రాజేశం, చల్ల బుచ్చిరాజు, చల్ల దేవమ్మ, ముస్కె కనకయ్య, చల్ల ఓదెలు, ఉప్పు ఎంకటి తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలలో మెరిసిన ఏ వి ఆర్ స్కూల్ విద్యార్థులు

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:

గండీడ్:మండల కేంద్రంలో ఏ వి ఆర్ గ్లోబల్ స్కూళ్లలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత నెల 22 తారీకు గురుకులాల సీట్లు సాధించేందుకు అర్హతపరీక్ష కొరకు 13 మంది విద్యార్థులు ఎగ్జామ్ రాయగ మంగళవారం రోజు గురుకుల ఫలితాలు వెలువడ్డాయి ఏ వి ఆర్ గ్లోబల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు 10 మంది గురుకుల సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మా పాఠశాల విద్యార్థులు గురుకులాల సీట్లు సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయురాలకు విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**పాలకుర్తి మండలంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటన**

అగ్నిధార న్యూస్ ,(పాలకుర్తి,):

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం పాలకుర్తి మండలంలో పర్యటించిన కలెక్టర్, తహసిల్దార్ కార్యాలయం, కన్నాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాత సామాగ్రిని విక్రయించాలని సూచించారు. కన్నాల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం నక్కిరెడ్డిపల్లి (కన్నాల) అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, పిల్లల ఎదుగుదలపై దృష్టి పెట్టాలని, నిబంధనల ప్రకారం పౌష్టికాహారం అందించాలని అన్నారు. అంగన్వాడీల ద్వారా పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందుతోందని పేర్కొన్నారు.

ఈ పర్యటనలో తహసిల్దార్ సునీతతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# 29వ డివిజన్‌లో తాగునీటి సమస్య తీవ్రం

**తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ విజ్ఞప్తి**

అగ్నిధార న్యూస్ ,(రామగుండం):

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ ఆర్షణపల్లి మల్లీశ్వరి--శ్రీనివాస్ కోరారు.మంగళవారం వారు మాట్లాడుతూ... అంతర్గాం మండలం లింగాపూర్ గ్రామం కార్పొరేషన్‌లో విలీనం అయిన తర్వాత 29వ డివిజన్‌గా ఏర్పడిందన్నారు. ప్రస్తుతం లింగాపూర్, ఇందిరమ్మ కాలనీల్లో తాగునీటి కొరత అధికమైందని, వేసవి కారణంగా పరిస్థితి మరింత విషమించే అవకాశముందని తెలిపారు.గ్రామ పంచాయతీ కాలంలో తవ్వించిన బోర్‌వెల్స్‌కు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి, పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. దీంతో తక్షణ ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్త బోర్‌వెల్స్ తవ్వించి, వాటికి మోటార్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు డివిజన్ మహిళలతో కలిసి మున్సిపల్ సూపరిండెంట్ గురువీర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్‌లకు వినతిపత్రం అందజేశారు. అధికారులు వెంటనే స్పందించి వేసవి నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుడెల్లి స్వప్న, స్నేహ, గౌతమి, పులి రమ్య, ప్రేమ, ఎల్లక్క, ఆర్షణపల్లి భీమలింగం, నగునూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుడు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:

మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల గ్రామ వార్డు సభ్యుడు ,మేస్త్రి ఆముదాల హనుమయ్య సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మంగళవారం నాడు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలతో శ్రద్ధాంజలి తెలిపి 5 వేలు ఆర్థిక సహాయం అందజేసి అధైర్య పడకూడదు అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. అలాగే గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ, మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో పోగుచేసిన 20వేల రూపాయలు కూడా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు

